# కాలిముల్లు

**భా**రతీయ శిక్షాస్మృతి అంటూ ఒకటి ఉంది కాబట్టి రామనాథం హాయిగా, ఠీవిగా తిరగ్గలుగుతున్నాడు. లేకుంటేనా నేనే ఏదో ఓ దుర్ముహూర్తం చూసుకుని ఓ వరస్టు ఈవినింగ్ అతనిలో విరగని ఎముకంటూ లేకుండా తన్ని తగలేసేవాడినేమో! అని ఎప్పుడూ అనిపిస్తూ ఉంటడం కానీ రామానాథం నాలో ఇంత కసీ ద్వేషం ఉంద ఊహించి ఉండడు. అందుకే తన ధోరణి కించిత్తుకూడా మార్చుకునే ప్రయత్నం చేసేవాడు కాదు.

అసలు రామనాథంమీద నేను పెంచుకుంటున్న కసిని చూసి అతను నాకు బద్ధ శత్రువేమోనని మీరు అనుకుంటే అది తప్పకుండా పప్పులో కాలు వేసినట్టే మరి! ఎందుచేతంటే అతను మాపొరుగువాడూ, మా కుటుంబమిత్రుడూనూ. అయితే, నానాటికీ అతనిమీద కసి అనండీ, ద్వేషం అనండీ, మరింకేదయినా అనండీ.... అలాంటివి ఏవైనా నాలో కలగడానికి కారణాలు రెండే రెండు, అతను చక్కటి లౌక్యుడు కావడం ఒకటీ, ఏ వస్తువునైనా కొనడంలో బేరసారాలు తెలిసినవాడు కావడం మరొకటీ!

అతనికి లౌక్యం తెలిసినా బేరసారాలు తెలిసినా నాకంటూ ఒరిగేదీ, తరిగేదీ ఏమీ లేదు. కాకపోతే సదరు లౌక్యం, బేరసారాలు ఎవరికీ తెలీనట్టు తరచూ అందరి ముందూ ప్రదర్శిస్తూ ఉంటాడు. అలాంటి ప్రదర్శనలకి బలి అయిపోతున్న వాళ్లలో నేనే మొదటివాడిని అని నా గట్టినమ్మకం. నిజం చెప్పాలంటే నాపెళ్లాం పిల్లల ముందు తల ఎత్తుకోలేనంతగా నన్ను ఫూల్‌ని చేయడం అతనికి అతి మామూలు అయిపోయింది.

ఎప్పుడయినా మార్కెట్టుకి వెళ్ళి ఏ ఉల్లిపాయలో అయిదు కిలోలు తెచ్చానే అనుకోండి.

అంతే!

రామనాథానికి ఎలా తెలుస్తుందో ఏమిటో గానీ వెంటనే పౌరాణిక సినిమాల్లో నారదుడిలా ప్రత్యక్షమౌతాడు మా ఇంటి ముంగిట్లో.

"ఏమప్పా! వెంకటేసులూ! ఉల్లిగడ్డలు ఎంతకి తెస్తివి?" అంటూ అడుగుతాడు.

"కిలో మూడు రూపాయలు రామనాథం!" అంటాను నేను లెక్కలమాష్టారి ప్రశ్నకు మొద్దబ్బాయి బెరుకు బెరుకుగా ఇచ్చిన సమాధానంలా ఉంటుంది నా పరిస్థితి.

"నీకీ జన్మకి లెక్కలు రావు వెధవా!" అన్న లెక్కలమాష్టారి ధోరణిలో చిత్రంగా నవ్వి వెంటనే ఫీలింగు మార్చేసి, జీవితంలో పూర్తిగా మోసపోయిన నిర్భాగ్యుణ్ణి

చూసినట్టు ఒక బలహీనమైన చూపు కళ్ల చివర్లలో సంధించి ఫకాల్న నవ్వేస్తూ రెట్టింపు గొంతుతో "ఎంతా? మూడు రూపాయలా కిలో?" అంటాడు రామనాథం.

"మరి మీరెంతకి తెస్తిరి రామనాధమన్నా!" అంటుంది మా ఆవిడ వంటింటిలో నించి. ఇక్కడికి ఎప్పుడు ఊడిందా అని నాకు ఒకటే ఆశ్చర్యం. అప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు.

"పెద్ద సైజు నారింజకాయంత ఉన్నాయమ్మా! ఉల్లిగడ్డలు కిలో రెండు రూపాయలకి పొద్దున్నే మార్కెట్టులో తెస్తి. ఇవి చూస్తే పిల్లోళ్ళు ఆడుకునే గోలీలంత ఉండాయి! మూడు రూపాయలంట కిలో. యాల అంతరేటుపెట్టి వచ్చెనో, ఈయప్ప! ఏందీ తెల్దు" అంటూ నావైపు చూసి మళ్ళీ ఫక్కున నవ్వేస్తాడు. అప్పుడు నేను మా ఆవిడ వైపు చూడను. ఎంచేతనంటే నాకు తెలుసు ఆవిడ చూపుల తూపులవాడి!

అట్లానే నిల్చున్నపాటున భూమి విచ్చుకుంటేనో, నేను అందులోకి కుంగిపోతేనో ఎంత బావుండును అనిపిస్తుంది.

అసలు చెప్పాలంటే రామనాధం కారణ జన్ముడనే నా అభిప్రాయం. అతను బేరం చేయడానికే పుట్టాడో, లేకుంటే రామనాధం బేరం చేసినపుడు అమ్మేవాళ్ళే అతని మాటలకి మెస్మరైజ్ అయిపోతారో నాకైతే ఎన్నటికీ అర్థంకాని విషయం. కాకపోతే అతనికి మాత్రమే తక్కువ ధరకి ఎందుకిస్తారు?

మా ఆవిడ ఎన్నాళ్ళగానో ఓ గోడగడియారం తెమ్మని పోరు పెడుతోంది. అలారం టైమ్‌పీసుతో సరిపెట్టుకోమని ఎంతో నచ్చచెప్పి చూశాను. ఊహూ! వినలేదు. పైగా గోడగడియారం ఇంటికి చాలా అందం అన్న పాయింటు లేవదీసింది. అది లేకున్న ఇల్లు ఇల్లేకాదదంది. ముందరింటి ముకుందమ్మ, పక్కింటి పార్వతమ్మ, చివరింటి సుభద్రమ్మలకు గోడగడియారాలు ఉండడంవల్ల మనల్ని తక్కువగా అంచనా వేస్తారని భయపెట్టింది. దాంతో నేను ఆమె దారికి రాక తప్పిందికాదు.

ఓ శుభోదయాన క్వార్జ్ గోడగడియారాన్ని తెగించేసి కొనేశాను. తెల్లటి గోడకి గులాబీ రంగు గడియారం ఎంత అంతంగా ఉందో చెప్పలేం! ఇక మా ఆవిడయితే మురిసిపోయింది. ఆ గడియారాన్ని తెచ్చినందుకు నన్ను ఒకటే పొగడ్డం మొదలు పెట్టింది. మా పిల్లలింక సరేసరి! ఆ గడియారాన్ని తయారుచేసినవాడే ఉంటే ఎంత పొంగిపోయేవాడో ఏమోగానీ నేను మాత్రం బాగా పొంగిపోయాను. అంతటితో ఊరుకోలేదు. మా శ్రీమతివైపు గర్వంగా చూస్తూ కాలరు ఎగరేసు కున్నానన్నది నిజం!

కాలరయితే ఎగరేసుకున్నానేగానీ ఆ రామనాధం ఏ క్షణంలోనైనా ఈ ఆనందాన్ని అపహరించుకుపోతాడనే దిగులు నా గుండెల్లో ముల్లులా పొడుస్తూనే ఉంది. అయినా నా గుండెని గుండ్రాయిలా మార్చేసుకుని ఈజీ ఛైర్లో కూచుని డైలీ పేపర్ని తిరగేస్తూ ఉన్నాను.

"ఇదేనా కొత్త గోడగడియారం?" అన్న మాటలు వినబడితే తలెత్తి చూశాను.

ఇంకేముందీ! ఎదురుగా రామనాధం!!!

"ఆc..అవును ఇదే..." అన్నాను అదురుతోన్న గుండెలతో.

"చాలా బావుంది వెంకటేసులూ!" అని రామనాధం మెచ్చుకుంటూ ఉంటే నాకు మూర్ఛవచ్చినంత పనయ్యింది. అవును మరి, రామనాధమేమిటీ! మెచ్చుకోవడమేమిటీ! 'కలయా నిజమా, వైష్ణవ మాయయా? ఆకటా! ఏమి ఈ విధివైచిత్ర్యము' అని నా మనసు ఆనందంతో వంకర్లు తిరుగుతోంది.

"నిజంగానా రామనాధం?"

"యస్.... అయితే రేటు కొంచెం ఎక్కువప్పా!" అన్నాడు రామనాధం నాకళ్ళలోకి చూస్తూ.

అప్పుడు అరికాల్నించి మండకుండా ఉంటుందా నాకు? "రామనాధం! దాని రేటు ఎంతో నేను చెప్పలేదు. అప్పుడే నేను ఎక్కువ రేటు పెట్టినట్లు మాట్లాడేస్తున్నావు! నన్ను ఫూల్‌ని చేయడం నీకు బాగా అలవాటయింది" అన్నాను కొంచెం కరుగ్గానే.

"కొంచెం తగ్గవయ్యా! నీ గడియారం వెల నూటయాభై రూపాయలు కదా!" అన్నాడతను. ముసిముసి నవ్వులు రువ్వుతూ, గారడీవాడిలా ఫోజుపెట్టి.

'భగవాన్! ఎదుటి మనిషి మనసులో మాట తెలుసుకునే ఏ టెలిపతీనో ప్రాక్టీసు చేయడం లేదు కదా!, అదే జరిగితే ఈ ప్రపంచంలో నాలాగా ఇంకెందరు నిర్భాగ్యులో తమ ఆస్తి ల్ని కోల్పోక తప్పదు కదా!' అని భయం వేసి వెన్నులో సన్నని వణుకు ప్రారంభమయింది.

"నీకెట్ల తెలుసు దాని రేటు?" అన్నాను భయం భయంగా. "అప్పుడే ఆశ్చర్యపోతే ఎట్లప్పా! ఇంకా చెప్పాలా? ఆ గడియారం అసలు రేటు నూటా అరవై రూపాయలు అని షాపువాడు నీకు రేటు చెప్పినాడు. నువ్వు చాలాసేపు బేరమాడీ ఆడీ పదిరూపాయలు తగ్గించి నూటయాభైకి రేటు తెంచేసి తెచ్చినావు. ఆ పదిరూపాయలు తగ్గించినందుకే తెగ మురిసిపోతా వున్నావు! అవునా?" ముప్ఫయి రెండుపళ్ళూ కనిపించేలా నవ్వేస్తూ అన్నాడు.

అమ్మ రామనాధం! అసాధ్యుడిలా ఉన్నాడే. నేనువెట్లా బేరమాడిందీ చెప్పేస్తున్నాడు. ఏం చేసేది? ఒప్పుకోక తప్పిందికాదు.

"అది సరేగానీ... ఇవన్నీ నీ కెట్ల తెలిసినాయి?" అన్నాను.

అతను బాలనాగమ్మని చూసిన మాయల మరాఠీలా నవ్వి, టీపాయిమీద ఉన్న సిగరెట్టు పాకెట్టులోంచి ఓ సిగరెట్టుని తీసుకుని నింపాదిగా వెలిగించుకుని, పొగని గుండెల దాకా పీల్చి, వాయిదాల పద్ధతిలో పొగని ముక్కులోంచి కాసేపూ, నోట్లోంచి కాసేపూ ఊది, నా వైపు చూసి ఓసారి కనుబొమ్మలు రెంటిని ఇంగ్లీషు హీరో లెవల్లో ఎగరేసి చెప్పడం ప్రారంభించాడు.

"నాకెట్ల తెలుసని గదా నీ ప్రశ్న? మా కొలీగ్ లేడూ మోహనరావు. అతనికి ఒక గోడ గడియారం కావాలంటే ఈ గడియారం కొన్న షాపుకే వెళ్ళినాం. అతనూ అచ్చం

ఇదే రకం గడియారాన్నే సెలక్ట్ చేసినాడు. ఆ షాపువాడు నువ్వు కూడా అచ్చం ఇలాంటి గడాయారాన్నే కొన్నట్టు చెప్పాడు. అయితే ఒక్క విషయం. నువ్వు ఆశ్చర్యపడిపోకూడదు. ఈ గడియారం అసలు ధర 110/- రూపాయలు. షాపువాడు లాభం ఆశించకుండా అసలు ధరకే ఇచ్చేసినాడు" అంటూ ఫకాల్మంటూ భేతాలుడిలా నవ్వాడు.

"నేను అప్పుడే అనుకొంటిని రామనాధమన్నా! ఈ మనిషి నూట యాభయి ఆ గడియారానికి పెట్టి తెచ్చినాడంటే కనీసం ముప్ఫయ్యో, నలభయ్యో మోసపోయి వుంటాడనీ!" అంటూ నా వెనకనుండి మా ఆవిడగొంతు.

నలభయి కాదు వెయ్యిన్నీ నలభయి రూపాయలు మోసపోయినా నాకు ఎలాంటి బాధా కలగదు కానీ, మా ఆవిడ దృష్టిలో నేను పనికిమాలినవాడిని అవడం, అందులోనూ రామనాధం ముందు నిజంగా భరించరాని బాధ. నరకలోకంలో రంపాలతో కోయడం, సలసల కాగే నూనెలో వేయించడం ఇవన్నీ ఆ బాధ ముందు ఎందుకూ పనికిరానివి. వచ్చిన పని అయిపోగానే చక్కగా సిగరెట్టు తాగుతూ వెధవనవ్వు నామీద రువ్వి వెళ్ళిపోయాడు రామనాధం.

మా ఆవిడ ఆ గోడగడియారిన్ని చూస్తున్నప్పుడు నలభై రూపాయలు మోసపోయిన విషయం జ్ఞాపకం చేస్తున్నట్టు నాలో గిల్టీ ఫీలింగు తొంగి చూసేది.

'ఏదయినా వస్తువు కొందామా!' అన్నప్పుడల్లా "ఆ రామనాధం అన్నయ్యని తీసుకుపోండి!" అంటోంది మా ఆవిడ. అంతకన్నా నా వ్యక్తిత్వాన్ని దారుణంగా అవమానించుకోవడం మరొకటి ఉందా? నేను ఎన్నివేలు నష్టపోతే మటుకూ ఆ రామనాధాన్ని పిల్చుకుపోయి వస్తువులు కొంటానా? అందుకే ఓ వరెస్ట్ ఈవినింగ్ అతన్ని తన్ని తగలేయడం మాత్రం ఖాయం!

★ ★ ★

టేప్ రికార్డర్ కమ్ ట్రాన్సిస్టరు కొనాలని నా చిరకాల వాంఛ! ఇన్నాళ్ళూ డబ్బు ఇబ్బందితో కొనలేకపోయాను. ఈసారి నా సెలవుజీతం రావడంతో చిరకాల వాంఛకు ప్రాణం వచ్చింది. ఏదేమైనా సరే కొనేయాలనీ తీర్మానించుకున్నాను. తీరా కొన్నాక నన్ను నేను చిత్రహింసలు పెట్టుకోవలసిందేనేమో ఆ రామనాధం గాడి దయవల్ల!

నా అదృష్టమేమోగానీ రామనాధం ఊళ్ళోలేడన్న సంగతి ఆరోజు ఉదయమే తెలిసింది. దక్షిణ భారతంలోని పుణ్యక్షేత్రాలు చూడ్డానికి సకుటుంబంగా వెళ్ళిపోయాడట!

"ఇది మంచి సమయము గదరా!" అని పాడుతూ నా మనసు ఆనందతాండవ మాడింది.

వెనుకాముందూ చూడకుండా ఓ మిత్రుడిదగ్గర ఉన్న టూ ఇన్ వన్ విదేశీ సెట్‌ని కొనేశాను. చాలా చక్కగా వుంది. దాన్ని కొన్నది పదహారు వందలకే అయినా ఆ రామనాధానికి పధ్నాలుగు వందలకి కొన్నట్లు చెప్పేయాలని నిర్ణయించుకున్నాను.

ఈ దెబ్బతో గురుడు ఖంగుతినడం ఖాయం! అతనలా ఖంగు తింటున్నప్పుడు మా ఆవిడ నా పక్కనే ఉండాలి. ఇది నా ఆశా, ఆశయమున్నూ.

ఒక వారంరోజు తర్వాత టూర్‌నుంచి రామనాథం వచ్చేశాడు. సాయంత్రం అయిదింటికల్లా మా ఇంట్లో వాలిపోయాడు. నేను ఈజీచైర్‌లో కూచుని ఠీవిగా చూశాను. అతను నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూచోగానే నేను టేబులుమీద వున్న టూ ఇన్ వన్ సెట్టును కావాలనే ఆన్ చేశాను. టేపులోంచి 'వయ్యారి గోదారమ్మా' అంటూ సినిమాపాట మొదలయింది. రామనాథం నోరు వెళ్ళబెట్టుకుని కళ్ళు పెళ్ళగించి చూస్తూ వుంటే నాకు ఒకటే గర్వం! ఇంక రేటు చెబితే నోరు ఊరువాకిలంత అవుతుందేమో, కళ్ళు ఊడి కిందకి టపీమని రాలిపడతాయేమో!

"ఎప్పుడు కొన్నావు?" అడిగాడు రామనాథం. నిద్రలో మాట్లాడుతున్నట్లు ఉంది అతని గొంతు.

"మొన్ననే..." అంటూనే మా ఆవిడని కేకేశాను. "ఇందూ! మీరామనాథం అన్నయ్య వచ్చినాడే. మంచి కాఫీ చేసి తీసుకురా!"

ఇంక ఎంతసేపూ.. రామనాథం 'ఖంగుతిను కాలము ఆసన్నమయినది కదా!" అని నా మనసు గొప్ప థ్రిల్‌గా ఫీలవుతోంది.

"ఎంతప్పా! వెంకటేసులూ!" యాంత్రికంగా నోరు మెదుపుతూ అడిగాడు రామనాథం.

"నువ్వు చెప్పుకో చూద్దాం!" అన్నాను నా మాటల్లో అతనికి కొంతయినా ఫోజు కనిపించి ఉండాలి.

"అట్ల కాదు. నువ్వు చెప్పల్ల ముందు!" అన్నాడతను.

అతనిలో నవ్వూ, సంతోషం మాయమైనట్టు అనిపిస్తోంది నాకు. రేటు చెప్పేసి అతన్ని ఖంగుతినేలా ఆశ్చర్యపరచాలని ఉబలాటపడుతోంది మనసు. నేను ఎంత తక్కువ రేటు చెప్పినా దానికి మరింత తక్కువరేటు చెప్పేసి తన ఆధిక్యతని ప్రకటించుకుంటే నా మానాలు ఏంగానూ? అందుకే నేను రేటు మాత్రం చెప్పదలుచు కోలేదు.

ఇందూ మా ఇద్దరికీ కాఫీలు అందించింది.

రామనాథం కాఫీ ఒక గుక్కతాగి "పదమూడు వందలకి కొనవచ్చు!" అన్నాడు నా కళ్ళల్లోకి పుల్కూ పుల్కూ చూస్తూ.

నాకు అరికాల్నించీ ఏకబిగిన మండసాగింది. "ఇద్దో రామూనాథం! నన్ను ఫూల్ చేయాలనే బుద్ధి మనసులో పెట్టుకుని ఇట్ల తక్కువ చేసి మాట్లాడేది ఏం బాగాలేదు. నువ్వు గొప్ప తెలివిమంతుడువీ, లౌక్యం తెలిసినవాడివీ కావచ్చు. ఈసెట్టు పదమూడు వందలకే వస్తుందని చెప్పేదుండే ఉత్త అతిశయోక్తి!" అన్నాను కోపంగానే.

రామనాథం మొహంలో రవ్వంతయనా మార్పులేదు. "పోనీ, ఎంతకి కొన్నావో చెప్పనన్నా చెప్పు మరి?" అన్నాడు సన్నగా నవ్వుతూ.

అసలు ధర చెప్పబోయి తమాయించుకుని పధ్నాలుగు వందలకి కొన్నట్లు అబద్ధపు ధర చెప్పేశాను.

అతను పకాపకా నవ్వి, "వెంకటేశులూ! నువ్వేమీ అనుకోనంటే ఒక్కమాట చెప్తాను. ఈ సెట్టు అసలు ధర 1200/- రూపాయలు. నువ్వు రెండువందలు అనవసరంగా పోగొట్టుకున్నావు."

మా ఆవిడ మా ఇద్దర్నీ గమనిస్తోంది.

"నేనేమీ అనుకోనుగానీ, నువ్వు దాని అసలు ధర ఎట్ల చెప్పగలుగుతున్నావో నాకు అర్థం కావడంలేదు" అన్నాను. చంపేయాలన్నత కోపాన్ని దిగమింగుకుని.

"ఇది నెలకిందట మా తమ్ముడు ఫారిన్ నుంచి తెచ్చినదే. కాబట్టి..టూర్‌కి వెళ్ళే ముందు ఆ పరమేశంగాడికి అమ్మేసిపోయాను లాభం ఆశించకుండా. ఒక్కమాట నాతో అని వుంటే నీకే అమ్మేవాడిని. పాపం..." అంటూ రామనాధం చెబుతూ ఉంటే నా గొంతులో పచ్చివెలక్కాయ ...మా ఆవిడకి నా మొహం చూపడమెలాగనీ.

(విపుల - డిసెంబరు, 1993)